క్లుప్తంగా

పాలేరు దళితవాతలో గంగజాతర



పాలేరు దళితవాడలో కొలువుదీరిన గంగమ్మ

బంగారుపాళెం: మండలంలోని పాలేరు దళితవాడలో మంగళవారం గంగమ్మ జాతర ప్రారంభం అయ్యింది. కార్యక్రమంలో భాగంగా ఉదయం అమ్మవారి అంబళ్లు, సాయంత్రం పొంగళ్లు సమర్పించారు. అమ్మవారిని తెల్లవారు జామున గ్రామ నడివీధిలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. బుధవారం సాయంత్రం ఉట్లతిరుణాళ్లు నిర్వహించి అనంతరం అమ్మవారిని మేళతాళాలు, బాణాసంచా వేడుకల నడుమ జలప్రవేశానికి తరలించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

120 మందికి వైద్య పరీక్షలు

తవణంపల్లె: మండలంలోని పల్లెచెరువులో మంగళవారం అరగొండ అపోలో హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 120 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గురుప్రశాంత్, జనరల్ డాక్టర్లు చైతన్య, వినీత రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఏడుగురిని ఎంపిక చేసి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని డాక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌ఓ కమ్రుద్దీన్ పాల్గొన్నారు.

34 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 34 మందికి జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు గత రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. 16 మందిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించగా, రూ.1.6 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీచేశారు. అలాగే వన్‌టౌన్ సీఐ మహేశ్వర జరిపిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన ఏడుగురికి రూ.10 వేల చొప్పున రూ.70 వేల జరిమానా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 11 మందికి రూ.వెయ్యి చొప్పున మొత్తం రూ.2.4 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరు రెండవ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

కారు ఢీకొని స్కూటరిస్ట్ మృతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టాభి (51) అనే వ్యక్తి మృతి చెందాడు. చిత్తూరు మండలం, బంగారెడ్డిపల్లికి చెందిన పట్టాభి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం తన స్కూటర్‌పై ఇరువారం వద్ద రోడ్డు దాటుతుండగా ఓ కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పట్టాభి అక్కడికక్కడే మృతి చెందగా.. కారు నడిపిన వ్యక్తి ఆపకుండా వెళ్లిపోయాడు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మామిడి గుజ్జు పరిశ్రమ వద్ద టోకెన్ల కోసం నిరీక్షిస్తున్న రైతులు



మామిడికాయ మండీలో గ్రేడింగ్ చేస్తున్న సిబ్బంది



మామిడి నేలపాలు

- కాయలు రాలిపోవడంతో కుదేలవుతున్న రైతులు
- విక్రయానికి అవస్థలు – పట్టించుకోని అధికారులు
- చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో రైతుల ఘోష

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మామిడి కాయలు రాలిపోతున్నాయి. కంటి ముందే కాయలు రాలిపోవడంతో రైతులకు కన్నీళ్లు కారుతున్నాయి. కోత కోసేందుకు భయపడుతున్నారు. అమ్మేదెట్లా అని దిగులు చెందుతున్నారు. సాహసించి కోత కోస్తే ఫ్యాక్టరీలకు చేరకుండానే కుళ్లిపోతున్నాయి. కాయల విక్రయానికి అవస్థలు పడుతున్నారు. ముందుగా టోకెన్ల కోసం తిప్పలు పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు.

చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో సుమారు 30వేల హెక్టార్ల దాకా మామిడి సాగవుతోంది. ఈ సారి సకాలంలో వర్షాలు కురవడంతో మామిడి పూత పుంజుకుంది. ఆశించిన స్థాయిలో పంట పండింది. రైతులు ఆశించిన మేర దిగుబడి వచ్చింది. తోతాపురి రకం పక్వానికి వచ్చి కోతకు పోటీపడుతున్నాయి. అయితే పంట విక్రయానికి రైతులు అవస్థలు పడుతున్నారు.

రైతుల ఇబ్బందులు

ఈ సారి పూతల ఆలస్యమైంది. వాతావరణ పరిస్థితుల కారణంగా పూతపై ప్రభావం చూపింది. ఇందుకు రైతులు అధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేశారు. కొంత మంది పూత వస్తుందిలే అని తేలికగా తీసుకున్నారు. రైతులు అనుకున్నట్లు ఈ సారి పూత మామిడి రైతులను రంజింప చేసింది. దిగుబడి ఆశ చూపించింది. పక్వానికి వచ్చిన కాయలు మైమరిపించింది. తీరా రైతులు కాయలు అమ్ముకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. ఫ్యాక్టరీల వద్ద పడిగావులు కాసి టోకెన్ల కోసం కుస్తీ పడుతున్నారు. వారి టోకెన్ ప్రకారం కాయలను కోసి ఫ్యాక్టరీకి తీసుకొస్తే.. ఫ్యాక్టరీలో అన్‌లోడింగ్‌కు మూడు రోజులు పడుతోంది. రైతులు ట్రాక్టర్ వద్దే మూడు రోజులు నిరీక్షించి కాయలు దింపి వస్తున్నారు.

అధికారుల సాకులు

కూటమి ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకుంటున్నట్లు ప్రచార ఆర్భాటం చేసి తీరా రైతు కష్టాలను గాలికొదిలేసింది. రైతుల గోడు చూసి ప్రభుత్వం ఏమాత్రం కనికరించని పరిస్థితి. అధికారులు కూడా తప్పించుకోవాలనే ప్రయత్నంలోనే ఉన్నారు. పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే కోసి అమ్ముకోవాలంటూ రైతుల కొంప ముంచుతున్నారు. అధికారులు చెప్పినట్లు ఎన్నిసార్లు కోత కోసి కూలీలకు డబ్బులు ఇచ్చుకోవాలని రైతులు మండిపడుతున్నారు. రైతుల అవస్థలు అధికారులకు తెలిసినా కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు వరకు కాయలు చెట్లల్లో నిలబడే ప్రసక్తే లేదని రైతులు తేల్చి చెబుతున్నారు. అధికారులు చెప్పినట్లే కాయలను చెట్లల్లోనే వదిలిస్తే పంట నష్ట పరిహారం కల్పిస్తారంటూ... అధికారులను రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇలాగే కొనసాగితే ఇక మామిడి పంటను వదులుకోవాల్సి వస్తుందని రైతులు హెచ్చరిస్తున్నారు. మామిడిని వదిలి కొబ్బరి తోటలు పెట్టుకునేందుకు పలువురు సంసిద్ధ మవుతున్నారు.

ధరలు పల్టీ

ధరలు రైతులను నట్టేట ముంచేస్తున్నాయి. రైతు ఎకరా పంటలో మామిడిని కాపాడేందుకు ఎకరాకు రూ. 40వేలు ఖర్చుచేస్తున్నారు. మందులు పిచికారీ, దుక్కులు, కొమ్మకత్తిరింపులు, కోత కూలీ, ఇతరత్రా ఖర్చులన్నీ కలిసి పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో పలుకుతున్న మామిడి ధరలు రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కానీ పరిస్థితి ఎదురైంది. టేబుల్ రకాల ధరలు కూడా ఈసారి రైతులకు సంతృప్తిని ఇవ్వలేదు. తోతాపురి విషయానికి వస్తే, ధరల పరిస్థితి దారుణంగా ఉంది. ప్రభుత్వం మద్దతు రూ.8 ప్రకటిస్తే.. ఆ ధరను ఫ్యాక్టరీ నిర్వాహకులు, వ్యాపారులు లెక్క చేయడం లేదు. ఇప్పుడు ర్యాంపులు రూ.3కే తోతాపురిని కొనుగోలు చేస్తున్నాయి. విధిలేక రైతులు ర్యాంపులకు అమ్మకానికి పెట్టుకుంటున్నారు.

మామిడి రైతుల కన్నీళ్లు కనబడటం లేదా?

- ప్రభుత్వానికి విజయానందరెడ్డి ప్రశ్న



చిత్తూరు కార్పొరేషన్: మామిడి రైతుల కన్నీళ్లు కూటమి ప్రభుత్వానికి కనబడటం లేదా అని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ప్రశ్నించారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు రోడ్లపైనే రాత్రి, పగలు నిద్రాహారాలు మానేసి వేచిచూస్తున్నారని చెప్పా రు. ఇటీవల జిల్లాలో పర్యటించిన వ్యవసాయశాఖ మంత్రి ఆదేశాలను ఫ్యాక్టరీ యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని చెప్పారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి మేలు చేయకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అధికార పార్టీ సిఫార్సులకు వందల టోకెన్లు ఇస్తున్నారని చెప్పారు. ఇందులో కూడా రాజకీ యం చేయడమేమిటన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో మామిడి రైతులకు కిలో రూ.25 వరకు చెల్లించినట్లు తెలిపారు. గుడిపాల మండలంలో ఫ్యాక్టరీల వద్ద కిలోమీటర్ల మేరకు క్యూలో ఉన్న రైతుల బాధ వర్ణనాతీతమన్నారు. రోజుల తరబడి అలా వేచి ఉన్నప్పటికీ ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. స్థానిక గాంధీ రోడ్డులోని డివిజన్ కార్యాలయ ఆవరణలో ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల ప్రజలు సమస్యలు ఉంటే తెలపాలని వివరించారు.

సీఎం నియోజకవర్గంలో ఇంత దారుణమా!

చిత్తూరు కార్పొరేషన్: సీఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో మహిళ ను ఇంత దారుణంగా కొడతారా అని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు నాగరాజు, గంగరాజు వేర్వేరు ప్రకటనల్లో మంగళవారం తెలిపారు. కుప్పం మండలం నారాయణపురం గ్రామంలో అప్పు తీర్చలేదని మహిళను చెట్టుకు కట్టేసి చిత్రహింసలు పెట్టిన మునికన్నప్పపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అప్పు వసూలు న్యాయపరంగా ఎన్నో మార్గాలు ఉన్నాయని చెప్పారు. కూలి పనులు చేసుకుంటూ పిల్లలను పోషించుకుంటూ అప్పు తీరుస్తున్న మహిళ పై ఇలా దాడి చేయడం సరికాదన్నారు. సకాలంలో అప్పు చెల్లించలేదని రోడ్డుపై వెళుతుండగా అసభ్యంగా మాట్లాడి డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరించడమేమిటన్నారు. ఈ తీరు ఆటవిక పాలనను తలపిస్తోందన్నారు. మునికన్నప్పపై చర్యలు తీసుకుని అప్పును మాఫీ చేసి బాధితురాలకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా గంగమ్మ మండల పూజ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



మండల పూజకు హాజరైన మహిళలు

గుడిపాల: మండలంలోని ముత్తువాళ్లూరు గ్రామంలో మంగళవారం ఘనంగా గంగమ్మ మండల పూజ కార్యక్రమం గ్రామస్తులు నిర్వహించారు. వేదపండితుల మధ్య అమ్మవారికి పూజలతో పాటు అభిషేకం చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వారి మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం వచ్చిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వర్షం కురవక.. విత్తనాలు వేయక

ఐరాల: ముందస్తు వర్షాలతో మురిపించిన వరుణుడు ఆ తరువాత ముఖం చాటేశాడు. నైరుతి రుతుపవనాలు ప్రభావం చూపుతున్నా భారీ గాలులకు మేఘాలు చెదిరిపోతున్నాయి. దీంతో కీలకమైన సమయంలో పదునైన వర్షం కురవడం లేదు. ఇప్పటికే దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్న రైతులు వరుణుడు కరుణించి మంచి వర్షం కురిస్తే విత్తనాలు వేయాలని భావిస్తున్నారు. కానీ వరుణుడు చిరుజల్లులతో సరిపెడుతున్నాడు. ప్రస్తుతం రాష్ట్రమంతటా వర్షాలు కురుస్తున్నా నియోజకవర్గంలో మోస్తారు వర్షం కూడా కురవలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో వర్షాలు కురవకపోతే విత్తనాలు మొలకెత్తడం ప్రశ్నార్థకంగా మారుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



సాగుకు సిద్ధం చేసిన పొలం

కొనుగోలుకు ఆసక్తి చూపని రైతులు


ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం రైతులకు రాయితీపై అందించే విత్తన వేరుశనగ కాయల కొనుగోలుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. పెట్టుబడికి చేతిలో చిల్లిగవ్వ లేకపోవడం ఓ కారణం కాగా, ప్రభుత్వం అందజేసే విత్తన వేరుశనగ కాయలు నాసిరకంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. దీంతో ఆర్‌ఎస్‌కేల్లో భద్ర పరిచిన వేరుశనగ కాయలు కొనుగోలు చేయడానికి పెద్దగా ముందుకు రావడం లేదు.

తగ్గుతున్న వేరుశనగ విస్తీర్ణం

ఖరీఫ్ సీజన్‌లో మండలంలో రైతులు 1,500 హెక్టార్లల్లో వివిధ పంటలు సాగు చేస్తారు. ప్రధాన వేరుశనగ పంట మాత్రం 800 హెక్టార్లలో సాగులోకి వస్తుంది. అయితే సాగు ఖర్చు పెరగడం, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోక పోవడం, ఎరువులు, పురుగుల మందుల ధరలు ఆకాశన్నంటుతుండడంతో ఏటా వేరుశనగ విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. ఈ క్రమంలో గత ఏడాది వేరుశనగ సాగు 300 హెక్టార్లకే పరిమితమైంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈసారి కూడా వేరుశనగ సాగు విస్తీర్ణం మరింత తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో పాటు ప్రభుత్వం రాయితీ ద్వారా అందించే అపరాలు అందించకపోవడం సాగు విస్తీర్ణం తగ్గుముఖం పట్టడానికి ఓ కారణం.

మళ్లీ దోచుకునేందుకే..

- గతంలో ఆయనపై పలు అభియోగాలు
- ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్‌గా పనిచేసిన సమయంలో అవకతవకలు
- ఫైల్ పెట్టాలంటూ డీఈఓ కార్యాలయ సిబ్బందికి బెదిరింపులు
- కూటమి ఎమ్మెల్యేల పేరుతో విద్యాశాఖ అధికారులపై ఒత్తిడి



డీఈవో కార్యాలయంలో మంగళవారం సిబ్బంది కుర్చీలో కూర్చుని బెదిరింపులకు పాల్పడుతున్న జయప్రకాష్ నాయుడు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : గత టీడీపీ పాలనలో ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌ల నుంచి అందినకాడికి దోచుకున్నాడు. ప్రతి స్టడీ సెంటర్ నుంచి ప్రతి నెలా మామూళ్లు వసూలు చేశాడు. ఏపీ ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ హోదాలో పాస్ గ్యారెంటీ స్కీంను అమలు చేసి ఇష్టానుసారంగా వసూళ్లకు పాల్పడ్డారు. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అదే జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ పోస్టులో కొనసాగేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. నోబుల్ టీచర్స్ అసోషియేషన్ టీడీపీ కి అనుబంధ సంఘం అంటూ చలామణి అవుతున్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు, స్కూల్ అసిస్టెంట్ జయప్రకాష్ నాయుడు జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్‌గా మళ్లీ కొనసాగేందుకు విద్యాశాఖ అధికారులపై ఒత్తిళ్లకు పాల్పడుతున్నారు.

అడ్డదారుల్లోనే..

లక్షల కొద్దీ జీతాలు తీసుకునే స్కూల్ అసిస్టెంట్లు అడ్డదారుల్లో ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్లుగా గతంలో కొనసాగేవారు. పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా ఎగనామం పెట్టేవారు. ఇలాంటి అడ్డదారుల్లో పనిచేసే ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్లను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏకంగా రద్దు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అలాంటి పోస్టుల్లో కొనసాగుతున్న టీచర్లందరూ పాఠశాలలకు పంపేసింది. ఆ స్థానంలో జిల్లా విద్యాశాఖ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్‌కు అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. ఈ నిర్ణయం వల్ల అదనంగా ఓ ఉద్యోగిని ఆ పోస్టులో నియమించాల్సిన సమస్య తప్పింది.

ఫైల్ పెడ్తారా.. చస్తారా.. అంటూ బెదిరింపులు

కూటమి ప్రభుత్వంలో ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ హోదాలో తిరిగి దోచుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. పలువురు కూటమి ఎమ్మెల్యేల నుంచి విద్యాశాఖ అధికారులకు తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఎలాంటి హోదా లేని ఆయన మంగళవారం డీఈవో కార్యాలయంలోని ఉద్యోగుల కుర్చీలో కూర్చుని ఫైల్ పెడ్తారా లేదా అంటూ డీఈవో కార్యాలయ సిబ్బందిపై బెదిరింపులకు పాల్పడ్డారు. గతంలో ఆయన జిల్లా కో-ఆర్డినేటర్‌గా పనిచేసిన సమయంలో పలు కో-ఆర్డినేటర్ కేంద్రాల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తిరుపతి జిల్లా నుంచి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు పై గతంలో విచారణ సైతం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జిల్లా సమగ్రశిక్ష శాఖలో ఎలాంటి హోదా లేకుండా కొన్ని నెలల పాటు కొనసాగారు. తీరా సమగ్రశిక్ష శాఖ నుంచి పాఠశాలకు పంపేశారు. అయితే అక్కడ విద్యార్థులకు పాఠాలు చెప్పడం ఇష్టం లేని జయప్రకాష్‌నాయుడు గెజిటెడ్ హెచ్‌ఎం హోదా లేకున్నప్పటికీ తిరిగి జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్‌గా కొనసాగేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. పలు అభియోగాలు ఉన్న ఆయనకు జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్‌గా నియమిస్తారా లేక పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు పాఠాలు చెప్పమంటారా అని వేచి చూడాల్సి ఉంది.

తుమ్మిందలో గంగజాతర



అమ్మవారి మండపం వద్ద అమ్మవారికి అంబలి సమర్పిస్తున్న భక్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో మంగళవారం గంగజాతర ప్రారంభమైంది. భక్తులు పంబవాయిద్యాల నడుమ ఊరేగింపుగా వచ్చి అమ్మవారిని ప్రతిష్ఠించే చోట అంబలిపోశారు. విశేష పూజలు చేశారు. రాత్రి వీధినాటక ప్రదర్శన చేశారు. బుధవారం ఉదయం అమ్మవారిని నడివీధిలో ప్రతిష్ఠించనున్నారు. అనంతరం విశేష పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నారు.



పాఠశాల కోసం దండం పెట్టి అభ్యర్థిస్తున్న గ్రామస్తులు

మా బడే ముద్దు.. వేరే పాఠశాల వద్దు

గంగాధరనెల్లూరు: తరతరాలుగా తమ తమ గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యాబుద్ధులు నేర్చుకున్నామని, నేడు తమ పిల్లలు వేరే గ్రామాలకు వెళ్లి చదువుకోవాల్సిన అవసరం ఏముందంటూ ప్రశ్నిస్తున్నారు. తమ ఊర్లోనే చదువుకోవాలి అంటూ మండలంలోని పలు గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు నిరసన తెలిపారు. మండలంలోని అంబోదరపల్లి గ్రామపంచాయతీ ఎల్‌ఎస్ కండిగ గ్రామంలో దాదాపు 20 మంది విద్యార్థులు ఉండగా అక్కడనుండి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మహాదేవమంగళం పాఠశాలకు మూడు నాలుగు ఐదు తరగతుల విద్యార్థులను ఎందుకు పంపిస్తున్నారని ప్రశ్నించారు. తమ గ్రామంలో నాడు నేడు కింద ఎంతో అభివృద్ధి పరిచిన పాఠశాలను విడిచి వేరే గ్రామానికి వెళ్లి చదువుకోవాల్సిన కర్మ ఏమిటి అన్నారు. తమ గ్రామంలోనే పాఠశాలలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు.

అగ్రహారంలోనూ ఇదే తంతు

మండలంలోని పాత వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని అగ్రహారం దళిత వాడలో దాదాపు 35 మంది విద్యార్థులతో పాఠశాల ఉదిం. అక్కడ నుండి తమిళనాడు రాష్ట్రం సరిహద్దుల్లోని కొత్త వెంకటాపురం గ్రామానికి వెళ్లి చదువుకోవాలని అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారని, దీనిపై గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రు లు మంగళవారం పాఠశాల వద్ద నిరసన తెలిపారు. అగ్రహారం గ్రామానికి చెందిన ఓ విద్యార్థి గతంలో కొత్త వెంకటాపురం పాఠశాలకు వెళ్లి తిరిగి వస్తూ ప్రమాదంలో మృతి చెందారు. అందుకే పిల్లలను అక్కడికి పంపలేమని, గ్రామంలోని పాఠశాల పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు.